
సాక్షి
పల్నాడు
మంగళవారం । 29 । ఆగస్టు । 2023




సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 4,513 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1,965 క్యూసెక్కులు వదిలారు.



'బెదురులంక' టీమ్ సందడి

పాత గుంటూరు: హీరో కార్తికేయ నటించిన బెదురులంక 2012 చిత్ర యూనిట్ సోమవారం గుంటూరు నాజ్ థియేటర్‌లో సందడి చేసింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 522.20 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

8న జెడ్పీ సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సెప్టెంబర్ 8న జరగనుంది. గతనెల 19న గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల వల్ల వాయిదా పడిన సమావేశాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధ్యక్షతన సెప్టెంబర్ 8న మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. అలాగే గతంలో వాయిదా పడిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలను సెప్టెంబర్ 8న ఉదయం 10 గంటలకు గుంటూరులోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహించేందుకు సీఈఓ జె.మోహన్‌రావు ఉత్తర్వులు విడుదల చేశారు. ఏడుస్థాయీ సంఘాలు జెడ్పీలో భేటీ కానున్నాయి. వీటిలో ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య–వైద్యం, అభివృద్ధి పనులకు సంబంధించిన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్నాయి. వ్యవసాయంపై 3వ స్థాయి సంఘ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ, శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘానికి తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షత వహించనున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా ఎంపిక పోటీలు ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు పట్టణంలోని డీఎస్ఏ స్టేడియంలో వివిధ క్రీడాంశాలలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు సోమవారం నుంచి ప్రారంభమైనట్టు జిల్లా చీఫ్ కోచ్ పి.అఫ్రోజ్‌ఖాన్ తెలిపారు. తొలిరోజు అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, బెస్ట్ ఫిజిక్ పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. 29న హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, స్విమ్మింగ్, ఖోఖో, 30న యోగా, మ్యూజిక్, డాన్స్, షార్ట్ ప్లే పోటీలు జరుగుతాయని వివరించారు.

పీహెచ్‌సీల్లో 24/7 సేవలు



ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సత్తెనపల్లి: వైద్యరంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రజలకు నిరంతర సేవలు అందించేందుకు కృషి చేస్తోంది. దీనిలో భాగంగా ఇకపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీలు)ల్లో 24 గంటలూ వైద్యసేవలు అందించేందుకు నడుంబిగించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ప్రస్తుతం 39 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిల్లో సెప్టెంబర్ 1 నుంచి నిరంతరం రోగులకు సేవలు అందనున్నాయి.

దిగ్విజయంగా ఫ్యామిలీ ఫిజీషియన్

ఇప్పటికే ప్రభుత్వం పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తోంది. ఇంటింటికీ వైద్య సేవలు అందిస్తోంది. దీనికోసం ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 మంది సిబ్బంది ఉండేలా నియామకాలు చేశారు. ఒక వైద్యుడు వైద్యశాలకు వచ్చే రోగులకు వైద్యం అందిస్తే.. మరో వైద్యుడు 104 వాహనం ద్వారా గ్రామాల్లో ఏర్పాటైన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు వెళ్లి ఉదయం నుంచి ఓపీ చూడటం, మధ్యాహ్నం నుంచి ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారి, దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి సేవలందిస్తారు. పాఠశాలల విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు పరీక్షలు నిర్వహిస్తారు.

సెప్టెంబర్ 1 నుంచి అమలు

- వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాలు
- పల్నాడు జిల్లాలో 39 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు

తలుపు తడితే వైద్యం

సెప్టెంబర్ ఒకటి నుంచి పీహెచ్‌సీల్లో 24 గంటలూ సేవలందించేలా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కొన్ని పీహెచ్‌సీల్లో సిబ్బంది పూర్తి స్థాయిలో ఉండగా, కొన్నింటిలో అరకొరగా ఉన్నారు. దీంతో ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది తప్పనిసరిగా ఉండేలా సర్కారు సర్దుబాటు చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి సెప్టెంబరు ఒకటో తేదీ నుంచే నిరంతర వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు. గతంలో ఎంపిక చేసిన కొన్ని పీహెచ్‌సీలే 24 గంటలూ పని చేసేవి. ఇక ముందు ఈ సేవలు అన్ని పీహెచ్‌సీలకూ వర్తిస్తాయి. తలుపు తడితే వైద్యం అందించేలా సర్కారు కృషి చేస్తోంది.

ఉండాల్సిన సిబ్బంది

ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మాసిస్టు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఇద్దరు సూపర్‌వైజర్లు (వీరు ఏఎన్‌ఎంలకు, వైద్యశాలకు మధ్య సంధానకర్తలుగా ఉంటారు). ఎంఎన్‌వో లేదా ఎఫ్‌ఎన్‌వో, మేల్, ఫిమేల్ అసిస్టెంటు, జూనియర్ అసిస్టెంటు ఉంటారు. వీరందరినీ ఇప్పటికే సర్దుబాటు చేయటం ప్రారంభించారు. ఈనెలాఖరుకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు.

సర్దుబాటు ప్రక్రియ జరుగుతోంది



జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలూ సేవలందిస్తున్నాయి. ప్రతి పీహెచ్‌సీలోనూ ఇద్దరు వైద్యాధికారులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, తొమ్మిది మంది ఇతర సిబ్బంది ఉండేలా చర్యలు చేపడుతున్నాం. స్టాఫ్ నర్సులు షిఫ్ట్‌ల వారీగా సేవలందిస్తారు. వారు సెలవులు పెట్టినప్పుడు సమస్య లేకుండా మూడో షిఫ్ట్ కోసం సీనియర్ స్టాఫ్ నర్సును నియమించనున్నాం. జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీల్లో సిబ్బందిని సర్దుబాటు చేస్తున్నాం.

– డాక్టర్ బి.శోభారాణి,
జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి, పల్నాడు

ఎవరేం చేస్తారంటే..

పీహెచ్‌సీకి కేటాయించిన ఇద్దరు వైద్యుల్లో ఒకరు ఆసుపత్రిలో ఉంటే మరొకరు పల్లెల్లోని హెల్త్ క్లినిక్‌లకు 104 వాహనంతో వెళ్లి వైద్య సేవలు అందిస్తారు. ఆ వైద్యుడు లేదా వైద్యురాలు మధ్యాహ్నం నుంచి ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారి ఫాలో అప్, పాఠశాల, అంగన్‌వాడీ బాలలకు వైద్య సేవలు అందించాలి. స్టాఫ్ నర్సులు ముగ్గురు ఉంటారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 వరకు వీరు మూడు షిఫ్ట్‌లలో పీహెచ్‌సీలలో పనిచేస్తారు. అత్యవసర కేసులు వస్తే కాల్ డ్యూటీ మీద రోగులకు వైద్యసేవలందించేందుకు వైద్యులు రావాల్సి ఉంది.



విద్యాదీవెన పథకం చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

బంగారు భవితకు విద్యాదీవెన

- అట్టహాసంగా విద్యాదీవెన నగదు జమ
- 37,012 మంది విద్యార్థులకు ప్రయోజనం
- రూ.30.23 కోట్ల మేర లబ్ధి

నరసరావుపేట: విద్యాదీవెన పథకం విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తోందని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా నగరి నుంచి 2022–23 విద్యా సంవత్సరం ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి సంబంధించిన విద్యాదీవెన నిధులను ల్యాప్‌ట్యాప్ బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో జమచేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. విద్యాదీవెన ద్వారా తాజాగా జిల్లాలో 37,012 మంది విదార్థులకు 33,848 మంది తల్లుల ఖాతాల్లో రూ.30.23 కోట్లు జమ చేసినట్టు వివరించారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ విద్యావ్యవస్థ బలోపేతానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజావలి, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు మానవత్వం చూపాలి

కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా, మండల అధికారులు మానవత్వం చూపాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి 210 అర్జీలను స్వీకరించారు. పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు, డీఆర్వో కె.వినాయకంలకు వినతి పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొద్దిసేపు కార్యక్రమంలో పాల్గొని అర్జీదారుల సమస్యలను విన్నారు. వాటిని సంబంధిత శాఖల జిల్లా అధికారులకు అందజేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పల్నాడు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దాతలు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతలను జిల్లా అధికారులు సత్కరించారు.



అర్జీదారుల సమస్య వింటున్న కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాద్

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్‌ఎస్ సేవలు

విభాగాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి, జిల్లా కలెక్టర్ శివశంకర్



ప్రభుత్వ వైద్యశాలలో ఈహెచ్‌ఎస్ సేవల విభాగాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు శీఘ్రగతిన వైద్యసేవలు అందించేందుకు ఎంప్లాయిమెంట్ హెల్త్ స్కీం (ఈహెచ్‌యస్) ఓపీడీ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. లింగంగుంట్ల కాలనీలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈహెచ్‌ఏస్ ఓపీడీ ప్రత్యేక విభాగాన్ని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలసి సోమవారం ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన పల్నాడు జిల్లాలో 55 నెట్‌వర్క్ ఆసుపత్రులున్నాయన్నారు. ప్రైవేటు, గుంటూరు జీజీహెచ్ ఆసుపత్రులతో కలిపి సుమారు 110 దాకా ఈహెచ్‌ఏస్ వైద్యసేవలు అందిస్తున్నాయని తెలిపారు. ఓపీడీ విభాగంలో

ప్రభుత్వ ఆదేశాల మేరకు రోజుకొక ప్రత్యేక డాక్టర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సోమవారం గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, మంగళవారం జనరల్ మెడిసిన్, బుధవారం గుండె, కిడ్నీ, గురువారం ఎముకలు, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, శుక్రవారం చర్మవ్యాధి, జనరల్ మెడిసిన్, శనివారం చిన్నపిల్లలు, జనరల్ మెడిసిన్ విభాగాలలో వైద్య సేవలు అందిస్తారని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులకు మరింత శ్రద్ధతో, ఇబ్బంది లేకుండా, నమ్మకంతో వైద్యసేవల్ని అందించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఈహెచ్‌యస్ విభాగం ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత వైద్య పరీక్షలు, విద్యా సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఏరియా ఆసుపత్రిలో 35 మంది డాక్టర్లు, 38 మంది నర్సులు మొత్తం 100 సిబ్బంది పని చేస్తున్నారని వివరించారు. 25 దీర్ఘకాలిక వ్యాధులకు ప్రత్యేక స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యసేవలు అందించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నెలకు 300 ప్రసవాలు, 200 పైగా సర్జరీలు నిర్వహించడం గొప్ప విషయమని అభినందించారు. నూతనంగా ఏరియా అస్సుపత్రికి న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటరు అనుమతి కూడా లభించిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణాధికారి, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.వి.రంగారావు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో- ఆర్డినేటర్ డాక్టర్ సునీల, నరసరావుపేట, మాచర్ల వైద్యశాలల గైనకాలజిస్టులు డాక్టర్ మంత్రు నాయక్, డాక్టర్ విజయలక్ష్మి, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేత్రదానం చేసి పునర్జన్మను పొందండి

నేత్ర దానం చేసి పునర్జన్మను పొందాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. సోమవారం లింగంగుంట కాలనీలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 38వ నేత్రదాన పక్షోత్సవాలు కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కరపత్రాల్ని ఆవిష్కరించారు. పక్షోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని పేర్లను నమోదుచేసుకొని కళ్లులేని వారికి కళ్ల దానం చేయాలని కోరారు. జిల్లా డీసీహెచ్ డాక్టర్ బి.వి.రంగారావు, అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైద్యాధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

డిసెంబరులో మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలు డిసెంబర్‌లో విశాఖపట్నంలో నిర్వహిస్తామని మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల తేదీలు, ఇతర వివరాలు త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇటీవల నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాల్ని తీర్మానంలో ఆమోదించామన్నారు. తమ సంఘాన్ని నేషనల్ మాస్టర్స్ అసోసియేషన్ లోకి తీసుకున్నారని పేర్కొన్నారు. రానున్న కాలంలో మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్‌తో పాటు క్రీడాకారుల భవిష్యత్తుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

ప్రజా యుద్ధనౌక గద్దరన్నకు నివాళి



గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నారాయణమూర్తి, విమలక్క, వైకే

పాత గుంటూరు: బడుగు, బలహీనవర్గాల రాజ్యాధికారం కోసం ప్రజా యుద్ధ నౌక గద్దరన్న విశేష కృషి చేశారని ప్రముఖ సినీ నటుడు ఆర్. నారాయణ మూర్తి అన్నారు. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, వీసీకే జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ తిరుమా వళవన్, అరుణోదయ విమలక్క, ప్రజా కవి జయరాజ్, ప్రజా కళామండలి కోటి, టీడీపీ నాయకుడు నక్కా ఆనందబాబు పాల్గొని గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సభకు ప్రముఖ న్యాయవాది వైకే అధ్యక్షత వహించారు. గద్దర్ పాడిన పాటలను గాయకులు ఆలపించారు.

'జగనన్నకు చెబుదాం' ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యం

52 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితంగా పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 52 ఫిర్యాదుల్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను శ్రద్ధతో, నిర్ణీత గడువులోగా పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, ఉద్యోగ మోసాలు తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) ఆర్.రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, క్రైం అదనపు ఎస్పీ ఎస్.కె. చంద్రశేఖర్, డీఎస్పీలు కె.వి మహేష్, పల్లపు రాజు, యు.రవిచంద్ర పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన వారికి పట్టణానికి చెందిన కోటిరత్నం కుమారులు శరత్ చందు, శేఖర్ అన్నదానం చేశారు.



మహిళ సమస్య వింటున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

దొంగపత్రాలతో స్థలాన్ని అమ్ముకున్నారు

నాకు నకరికల్లులో పది సెంట్లు, ఐదు సెంట్ల గల రెండు ప్లాట్లు ఉన్నాయి. వాటిని ముగ్గురు వ్యక్తులు కుమ్మక్కై, దొంగపత్రాలు సృష్టించి, ఒకరి నుంచి మరొకరు కొన్నట్లుగా అమ్ముకున్నారు. ఆ రిజిస్ట్రేషన్లను రద్దుపర్చి వారిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి .

–షణ్ముక్, నకరికల్లు

దొంగ పత్రాలతో పొలం అమ్మకం

నాకు డబ్బులు అవసరమై 2.5ఎకరాలకు చెందిన పొలం కాగితాలు తాకట్టు పెట్టి రూ.2 వడ్డీపై రూ.4.5లక్షల తీసుకున్నా. తీరా డబ్బులు మొత్తం చెల్లించి కాగితాలు ఇవ్వమంటే ఇవ్వట్లేదు. నా పొలాన్ని వేరే వ్యక్తులకు దొంగ పత్రాలు సృష్టించి విక్రయించాడు. అతడిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

–రాంబాబు, చిలకలూరిపేట

భర్తపై చర్యలు తీసుకోండి

నాకు, నా భర్తకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. నన్ను వదిలేసి మరో స్త్రీతో సంబంధం పెట్టుకున్నాడు. నన్ను కాపురానికి తీసుకెళ్లట్లేదు. అతనిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

––భూలక్ష్మి, కంభంపాడు, వినుకొండ

ప్రభుత్వ భూముల ఆక్రమణపై విచారణకు ఆదేశం

- ముగ్గురు అధికారులతో కమిటీ నియామకం
- వారంలోగా నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశం

నరసరావుపేట: వినుకొండ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు ఆక్రమణ ఆరోపణలపై జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ముగ్గురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. తమ నియోజకవర్గంలోని ఐదు గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, వీటిపై విచారణ చేయించాలని కోరుతూ సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను కలసి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు నరసరావుపేట ఆర్డీవో, పులిచింతల డెప్యూటీ కలెక్టర్, స్థానిక రెవెన్యూ అధికారుల్ని కలెక్టర్ సభ్యులు గా నియమించారు. వారం రోజుల్లో సర్వే నంబర్లు, విస్తీర్ణంపై లోతైన విచారణ చేసి సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించారు. వినుకొండ మండలం కొప్పుకొండలోని 281-4ఏ, 281-4బీ సర్వే నంబర్లపై విచారణకు ఆర్డీవో శేషిరెడ్డి, వినుకొండ తహసీల్దార్, వినుకొండ మండల సర్వేయర్, కొప్పుకొండ వీఆర్వో, గ్రామ సర్వేయర్‌ను నియమించారు. నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామంలోని 567, 533-ఒ, 533-బీల విచారణకు ప్రత్యేక డెప్యూటీ కలెక్టర్ కె. శ్రీరాములు, స్థానిక తహసీల్దార్, మండల సర్వేయరు, గ్రామ సర్వేయరు, వీఆర్వోలు, ఈపూరు కొచ్చర్ల గ్రామంలోని 727-2, 727-2ఏ, 30-బీ, 30-బీ1, 32-2 సర్వే నంబర్ల విచారణకు పీఏ టు స్పెషల్ కలెక్టర్ వసంతబాబు, ఈపూరు తహసీల్దార్, వీఆర్వో, గ్రామ సర్వేయర్‌ను జిల్లా కలెక్టర్ నియమించారు.

ఘనంగా జెడ్పీ చైర్‌పర్సన్ జన్మదిన వేడుకలు



హెనీ క్రిస్టినాకు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, కత్తెర సురేష్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా జన్మదిన వేడుకల్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నగరంలోని వృద్ధాశ్రమాలు, మానసిక వికలాంగుల ఆశ్రయాల్లో సేవా కార్యక్రమాల్ని నిర్వహించారు. పేదలకు నూతన వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. జెడ్పీ సమావేశ మందిరంలో అన్ని విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి యేసురత్నం, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేష గిరిరావు, విభిన్న ప్రతిభావంతుల సంస్థ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, జెడ్పీ ఉపాధ్యక్షుడు బత్తుల అనూరాధ, శొంఠిరెడ్డి నర్సిరెడ్డి పాల్గొని హెనీ క్రిస్టినాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌తో కలసి హెనీ క్రిస్టినా జన్మదిన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ ప్రాంగణంలో మొక్క నాటారు.

ఇంట్లో బంగారం చోరీ

చీరాల: ఇంట్లో బంగారం చోరీకి గురైన ఘటన ఈపురుపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం.. ఈపూరుపాలెం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో నివసిస్తున్న గెల్లి పున్నారావు ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలసి పొన్నూరు వెళ్లారు. అక్కడి నుంచి తన మనుమరాలికి పెళ్లి సంబంధం మాట్లాడేందుకు పిడుగురాళ్ల వెళ్లి రాత్రి పొన్నూరులోనే ఉండిపోయారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచి ఉండటం గమనించారు. బీరువాలో ఉంచిన 3.50 సవర్ల బంగారం, 75 గ్రాముల వెండి, రూ.5 వేల చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



బాపట్ల అర్బన్: ఆంధ్రప్రదేశ్ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగుల జీతాలు 23 శాతం పెంచుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జీవో నంబర్ 64 విడుదల చేయడం హర్షణీయమని వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే కోన రఘుపతిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎంలు, సీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు చిక్కిన భారీ ఏనుగు టేకు చేప



వలకు చిక్కిన ఏనుగు టేకు చేపను ఒడ్డుకు చేర్చుతున్న మత్స్యకారులు



ఒడ్డుకు చేర్చిన నాలుగు క్వింటాళ్ల భారీ ఏనుగు టేకు చేప

చీరాల టౌన్: మత్స్యకారుల వలకు భారీ ఏనుగు టేకు చేప చిక్కింది. వివరాలు.. మండలంలోని వాడరేవుకు చెందిన గంగిరి గోవిందు, ఐదుగురుతో కలసి నాలుగు రోజుల క్రితం సముద్రంలో వేటకు వెళ్లాడు. ఆదివారం రాత్రికి వేట ముగించుకుని తిరిగి తీరానికి వస్తుండగా వలకు భారీగా మత్స్య సంపద చిక్కిందని ఆనంద పడ్డారు. కష్టపడి వలను బయటకు లాగి చూస్తే 9 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పుతో 4 క్వింటాళ్లకుపైగా బరువు ఉన్న ఏనుగు టేకు చేప పడింది. ఐదు రోజులుగా వేట చేస్తున్న తమకు టేకు చేప వలకు చిక్కగా సోమవారం తీరం ఒడ్డున వేలం పాట నిర్వహించగా కేవలం ఈ టేకు చేప రూ.2 వేలు పలకడంతో వేట చేసిన మత్స్యకారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. వేటకు రూ.30 వేలు ఖర్చు కాగా టేకు చేప వలన తమకు ఖర్చులు, కష్టాలు మిగిలాయని మత్స్యకారులు చెప్పారు. ఐదు రోజుల క్రితం వాడరేవు మత్స్యకారుల వలకు 800 కిలోల బరువు ఉన్న పులి మచ్చల సొర చేప వలకు చిక్కింది. భారీగా మత్స్య సంపద చిక్కిందని ఆనందపడిన మత్స్యకారులకు కష్టం మిగిలింది. కాసులు మాత్రం పడలేదు.

ఉత్తమ విద్యనందించడమే లక్ష్యం: డీఈవో

నరసరావుపేట రూరల్: ఉత్తమమైన విద్యనందించడమే లక్ష్యంగా ప్రధానోపాధ్యాయులు పని చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ తెలిపారు. లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూలులో నరసరావుపేట, సత్తెనపల్లి డివిజన్ల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని వేర్వేరుగా సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తే, ఫలితాల సాధనలో ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలో 5-18 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరూ పాఠశాలలో ఉండాలని చెప్పారు. గత ఏడాది ఫెయిల్ అయిన విద్యార్థుల్ని పాఠశాలలో లేదా ఓపెన్ స్కూలులో చేరే విధంగా ప్రోత్సహించాలని చెప్పారు. బడిఈడు పిల్లలందరూ పాఠశాలలో వంద శాతం నమోదు చేయించే బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందని తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని ప్రతి ఒక్కరూ తినే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, దీనిపై అశ్రద్ధ వహించవద్దని సూచించారు. ప్రతి పాఠశాల నుంచి ఐదు ఇన్‌స్పైర్ అప్లికేషన్లు ఈనెల 30వ తేదీ లోగా పూర్తిచేయాలని తెలిపారు. ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాల కోసం అర్హత కలిగిన ఎనిమిదో తరగతి విద్యార్థులతో సెప్టెంబర్ 15వ తేదీలోగా దరఖాస్తు చేయించాలని సూచించారు. నాడు-నేడు బిల్లులు సకాలంలో ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారులు వేణుగోపాలరావు, వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వయో వృద్ధులకు సన్మానం



వృద్ధులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాదు

నరసరావుపేట: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలోని 20మంది వయో వృద్ధుల్ని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాదు సత్కరించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 20మంది సూపర్ సీనియర్ సిటిజన్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయో వృద్ధుల్ని సన్మానించడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారుల్ని అభినందించారు. సన్మానం పొందిన వారిలో డాక్టర్ రామ్మోహన్, చుక్కా విన్సెంట్‌పాల్, గంధం యాజ్ఞవల్క్యశర్మ, షేక్ నాసరబీ, ఆర్.లక్ష్మి, ఇక్కుర్తి నాగరత్నం, దుర్గాబాబు, షేక్ నూరున్నీసా, ఆకురాతి వీరాస్వామి, నూనె చిన అంకులు, కె.చెన్నమ్మ, వేల్పుల పోలరాజు, పెద్దరామిరెడ్డి, యాగమ్మ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.వినాయకం, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పీడీ అరుణ, సీడీపీవో మాణిక్యాలరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ జట్టు ఇదే



రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన పురుషుల, మహిళల జట్లతో కిశోర్‌బాబు, నరేష్

మంగళగిరి: కావలిలో సెప్టెంబరు ఎనిమిదో తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు పురుష, మహిళా జట్లను ఎంపిక చేసినట్లు షూటింగ్ బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కిశోర్‌బాబు, సంయుక్త కార్యదర్శి కె.నరేష్, వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల పీటీ రవి సోమవారం తెలిపారు. నగరంలోని వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వారు రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన పురుష, మహిళల జట్ల వివరాలను వెల్లడించారు. పురుషుల జట్టుకు కె.తేజ, ఎస్కే సమీర్, ఎం గోపాల్, బి.నాగేశ్వరరావు, కె.భాను, ఎం శివసాయి, బి.జగదీష్, ఎం.వెంకటసాయి, కె దుర్గా ప్రసాద్, పి.సతీష్, టి.తేజ, జె.నారాయణ, కె.రేవంత్, బి.చిట్టిబాబులు ఎంపికైనట్లు తెలిపారు. మహిళల జట్టుకు వి.తనుశ్రీ, బి. గుణప్రియ, చంద్రిక, దివ్య, పి.శారద, సీహెచ్ కృష్ణకుమారి, పి.నీలిమాదేవి, బి.బెస్సీ, కె.శ్రావణి, టి.త్రివేణి, ఈ.వెంకటలక్ష్మి, బి.జ్యోతి, బి.దేవి, కె రేష్మలు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల సెక్రటరీ వి.తాతారావు, ప్రిన్సిపాల్ జి. నాగేశ్వరరావు, డాన్‌బాస్కో స్కూల్ పీడీ కె. పాల్‌రాజ్, బి.ప్రవీణ్ పాల్గొన్నారు.